సాక్షి
హనుమకొండ

మంగళవారం । 9 । ఏప్రిల్ । 2024



పేరుకే 24 గంటలు

సిబ్బంది కొరతతో ఆత్మకూరు ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంలో 24 గంటల వైద్య సేవలు అందని ద్రాక్షగా మారాయి.

- 9లో▸



సైన్స్‌తోనే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం

నేటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సైన్స్‌తోనే సాధ్యమైందని సీకేఎంజీ మాజీ డైరెక్టర్ మోహన్‌రావు అన్నారు.

- 8లో▸

గరిష్టం/కనిష్టం
$36^0/25^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఎండ ఎక్కువగా ఉంటుంది. రాత్రి ఉక్కపోతగా ఉంటుంది.



న్యూస్‌రీల్

ఆయింట్‌మెంట్లు సీజ్



ఎంజీఎం : హనుమకొండ బాలసముద్రంలోని జనతా క్లినిక్‌లో డ్రగ్ కంట్రోల్ అధికారులు సోమవారం తనిఖీలు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా అధిక ధరలకు విక్రయిస్తున్న రూ.6,270 విలువగల 38 ఆయింట్‌మెంట్లను సీజ్ చేశారు. డ్రగ్ కంట్రోల్ ఏడీ రాజ్యలక్ష్మి, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ కథనం ప్రకారం తమిళనాడుకు చెందిన ముపిరోసిన్ అనే ఐదు గ్రాముల ఆయింట్‌మెంట్‌ను ఈ షాపులో తమ లేబుల్‌పై ఎమ్మార్పీ రూ.165తో విక్రయిస్తున్నారు. విషయం తెలుసుకుని తనిఖీలు చేయగా ఐదు గ్రాములకు రూ.101.45 ఉండాలి. జీఎస్టీతో కలిపి సీలింగ్ ధర రూ.113.6 కాగా.. అంతకంటే ఎక్కువ ధరలకు విక్రయించారు. సదరు కంపెనీ నిర్వాహకులు రూ.51.4 అధిక ధరకు విక్రయిస్తూ ప్రజల నుంచి 45.2 శాతం అదనంగా దోపిడీ చేస్తున్నారని అధికారులు తెలిపారు. ఆయింట్‌మెంట్లను సీజ్‌చేసి కేసు నమోదు చేసినట్లు వారు పేర్కొన్నారు.

సకల శుభాలు కలగాలి

ప్రజలకు కలెక్టర్ల ఉగాది శుభాకాంక్షలు



హన్మకొండ అర్బన్ : హనుమకొండ జిల్లా ప్రజలకు కలెక్టర్ సిక్తాపట్నాయక్ సోమవారం ఒక ప్రకటనలో ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. శ్రీక్రోధి నామ సంవత్సరంలో ప్రజలందరికీ సకల శుభాలు కలగాలని ఆకాంక్షించారు. ప్రజలందరి జీవితాల్లో ఆనందోత్సాహాలు నింపాలని కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ సంవత్సరంలో జిల్లా మరింత ప్రగతి సాధించాలని, ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

వరంగల్ కలెక్టర్..



కరీమాబాద్ : వరంగల్ జిల్లా ప్రజలకు కలెక్టర్ ప్రావీణ్య ఒక ప్రకటనలో ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. శుభాలనిచ్చే శ్రీక్రోధి నామ సంవత్సరంలో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, కోరికలు నెరవేరాలని కలెక్టర్ ఆకాంక్షించారు. సంస్కృతీసంప్రదాయాలు చాటిచెప్పేలా ఉగాది వేడుకలను ఘనంగా జరుపుకోవాలని ఆమె కోరారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి



విద్యారణ్యపురి : అర్హులు ఓటరుగా నమోదు చేసుకోవాలని హనుమకొండ అదనపు కలెక్టర్ రాధికాగుప్తా కోరారు. హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కొత్త ఓటర్ల నమోదు, ఓటింగ్ శాతం పెంచడంపై విద్యార్థులకు స్వీప్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఓటుహక్కును వినియోగించుకోవాలని కోరారు. ట్రైనీ కలెక్టర్ శ్రద్ధాశుక్లా, స్వీప్ నోడల్ అధికారి, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మి, బాధ్యులు రమాకాంత్, కేడీసీ ప్రిన్సిపాల్ రాజిరెడ్డి, డీఎల్పీఓ సుదర్శన్, ఎంపీ రవిబాబు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వినోద్‌రావు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మే 1 నుంచి వేసవి క్రీడాశిక్షణ శిబిరాలు

వరంగల్ స్పోర్ట్స్ : తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాలతో మే ఒకటి నుంచి 31వ తేదీ వరకు ఉచిత వేసవి క్రీడాశిక్షణ శిబిరాలు నిర్వహించనున్నట్లు హనుమకొండ డీవైఎస్‌ఓ అశోక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణ పొందేందుకు 4వ నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న బాలబాలికలు అర్హులని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో శిబిరాలను నిర్వహించేందుకు పీడీ, పీఈటీలు లేదా సీనియర్ క్రీడాకారులు అర్హులని, ఆసక్తి గల వారు ఈ నెల 25 వరకు హనుమకొండ ఇండోర్ స్టేడియంలోని డీఎస్‌ఏ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అలాగే, పట్టణంలోని జేఎన్ఎస్‌లో డీఎస్‌ఏ కోచ్‌లు, సీనియర్ క్రీడాకారుల ఆధ్వర్యంలో తాత్కాలిక ఫీజు పద్ధతిన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.



ఉగాది ఉషస్సులు..

శ్రీక్రోధి నామ సంవత్సర సందడి..

వేపచెట్లు అమృతాన్ని నింపుకున్న పూలతో ప్రకాశిస్తుండగా.. మామిడి చెట్లు లేలేత పిందెలతో మానవ కళ్యాణానికి మంగళగీతాలు పాడుతుండగా.. మోదుగచెట్లు నిప్పు కణికలాంటి పూలతో శోభాయమానం చేస్తుండే రమణీయమైన సొగసుల కాలమే వసంతమే. చైత్ర శుక్ల పాడ్యమి రోజున జరుపుకునే తెలుగువారి తొలి పండుగ ఉగాది. శ్రీక్రోధినామ సంవత్సరానికి స్వాగతం పలికేందుకు వరంగల్ నగరవాసులు సిద్ధమయ్యారు. మంగళవారం ఉగాదిని పురస్కరించుకుని నగరంలోని పలు కూడళ్లలో సందడి నెలకొంది. ఉగాది పచ్చడికి అవసరమైన కొత్తకుండలు, చింతపండు, మామిడాకులు, మామిడికాయలు, వేపపూవు కొనుగోలు చేశారు. పండుగ రోజు పంచాంగ శ్రవణానికి ఆలయ కమిటీలు అన్ని ఏర్పాట్లు చేశాయి.

- వివరాలు 8లో▸ - హన్మకొండ కల్చరల్

16న 5కే రన్



సమావేశంలో మాట్లాడుతున్న ట్రైయినీ కలెక్టర్ శ్రద్ధాశుక్లా

హన్మకొండ అర్బన్ : ఓటు హక్కు వినియోగంపై చైతన్యం కలిగించేందుకు స్వీప్ అధ్వర్యంలో ఈనెల 16న 5కే రన్ నిర్వహించనున్నట్లు ట్రైయినీ కలెక్టర్ శ్రద్ధాశుక్లా తెలిపారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో సోమవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 5కే రన్ ఉదయం 6 గంటలకు నగరంలోని జేఎన్ఎస్ నుంచి ప్రారంభమై కలెక్టరేట్ వరకు సాగుతుందని తెలిపారు. విద్యార్థులు, యువత, అధికారులు, ఉద్యోగులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. స్వీప్ నోడల్ ఆఫీసర్ లక్ష్మీరమాకాంత్, జిల్లా సంక్షేమాధికారి మధురిమ, జీడబ్ల్యూఎంసీ కాజీపేట డిప్యూటీ కమిషనర్ రవీందర్, డీవైఎస్‌ఓ అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

వ్యాపార అడ్డా ఎంజీఎం

నిబంధనలకు తిలోదకాలు

- గత ప్రజాప్రతినిధుల అండదండలతో వెలిసిన దుకాణాలు
- ఫుడ్ లైసెన్సులుండవు.. టెండర్ ప్రక్రియ అసలే ఉండదు!
- అద్దె సైతం చెల్లించరు
- మాకెవరు అడ్డు అంటున్న నిర్వాహకులు
- మంత్రి ఆదేశాలతో నోటీసులిచ్చి చేతులు దులుపుకున్న అధికారులు





ఎంజీఎం ఆస్పత్రి ప్రాంగణంలో దుకాణా సముదాయాలు

ఎంజీఎం: వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి పాలన గాడి తప్పుతోంది. ఆస్పత్రిలో హెచ్‌డీఎస్ సమావేశం ఉండదు. హెచ్‌డీఎస్ కమిటీలుండవు. టెండర్ లేకుండానే కలెక్టర్ అనుమతులున్నాయంటూ.. ఎప్పుడు ఏ కొత్త దుకాణం ఆస్పత్రి ప్రాంగణంలో ఏర్పాటవుతుందో అర్థం కాని పరిస్థితి. కలెక్టర్ అనుమతులిచ్చినా దుకాణా సముదాయాల్లో విచ్చలవిడిగా నాసిరకం వస్తువులు విక్రయిస్తూ.. అటెండెంట్ల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. అయినా.. పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడు. సూపరింటెండెంట్ చాంబర్ పక్కనే ఉన్న డాక్టర్స్ క్యాంటీన్ అద్దె చెల్లించకపోయినా అధికారులు పట్టించుకోడం లేదు. ఇలా ఆస్పత్రి ప్రాంగణంలో గత ప్రభుత్వ ప్రజాప్రతినిధులు, నేతల అండదండలతో విచ్చలవిడిగా దుకాణా సముదాయాలు వెలిశాయి. ఆస్పత్రి క్యాజువాలిటీ ప్రాంతమంతా ఓ కమర్షియల్ స్ట్రీట్‌గా మారిపోయింది.

రూ.8.5 లక్షల మేర బకాయిలు

గత సంవత్సరం డిసెంబర్ 31న మంత్రి కొండా సురేఖ ఎంజీఎం ఆస్పత్రిలో సమీక్ష నిర్వహించి ఆస్పత్రి ప్రాంగణంలో దుకాణా సముదాయాలపై ప్రత్యేకంగా ఆరా తీశారు. ఆస్పత్రిలో ఎన్ని దుకాణ సముదాయాలున్నాయి.. ఎంత మేరకు బకాయి ఉంది? వారు ఎందుకు అద్దె చెల్లించడం లేదనే అంశాలపై మంత్రి పరిపాలనాధికారులను ప్రశ్నించారు. అనుమతులు లేని షాపులను వెంటనే తొలగించడంతో పాటు అద్దె చెల్లించని వారికి నోటీసులు అందజేసి వెంటనే ఆస్పత్రి నుంచి ఆ దుకాణా సముదాయాలను తొలగించాలని ఆదేశించారు. ఈమేరకు జనవరిలో ఎంజీఎం పరిపాలనాధికారులు నోటీసులు జారీ చేశారు. మొత్తం రూ.8.5 లక్షల మేర బకాయిలున్నప్పటికీ ఆస్పత్రికి వారు రూ.92 వేలు మాత్రమే చెల్లించారు.

అనుమతులు ఒకటి.. విక్రయాలు మరోటి

ఆస్పత్రిలో ప్రాంగణంలో రోగుల అటెండెంట్ల సౌకర్యార్థం ఫార్మసీ క్యాంటీన్, రిటేల్ షాపు, విజయ డెయిరీ, ఫార్మసీ, టెలిఫోన్ బూత్‌ల నిర్వహణ కోసం అనుమతులు తీసుకున్న వ్యాపారులు విచ్చలవిడిగా నాసిరకం వస్తువులు విక్రయిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ఆస్పత్రి ప్రాంగణంలో రెండేళ్ల క్రితం ఏర్పాటు చేసిన క్యాంటీన్ నిర్వహణ పూర్తిగా అధ్వానంగా ఉందని, నాసిరకం వస్తువులు అమ్ముతున్నారని రోగుల అటెండెంట్లు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

నోటీసులిచ్చాం..

ఎంజీఎం ఆస్పత్రి ప్రాంగణంలో అద్దె చెల్లించని దుకాణా సముదాయాలకు నోటీసులు జారీ చేశాం. నోటీసుల జారీతో రూ. 92 వేలు వసూలయ్యాయి. ప్రస్తుతానికి ఆస్పత్రిలో ప్రాంగణంలోని దుకాణ సముదాయాల ద్వారా ఆస్పత్రి అభివృద్ధికి రూ.7,13,465 ఆదాయం రావాలి. వీరికి మరోసారి నోటీసులు జారీ చేశాం. ఎలాంటి స్పందన లేదు. ఉన్నతాధికారుల ఆదేశాలతో మరోసారి చర్యలు చేపడతాం.

- శ్రీనివాస్, ఆర్ఎంఓ, ఎంజీఎం

డీజిల్ స్వాహాపై కమిషనర్ సీరియస్

విధుల నుంచి ఔట్‌సోర్సింగ్ డ్రైవర్ రమేశ్ తొలగింపు

సాక్షి ఎఫెక్ట్



వెహికిల్ షెడ్డులో అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ అశ్వినితానాజీ వాకడే

వరంగల్ అర్బన్ : పారిశుద్ధ్య వాహనాల షెడ్డులో అక్రమణలు, డీజిల్ స్వాహాపై గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ అశ్వినితానాజీ వాకడే సీరియస్ అయ్యారు. డీజిల్ స్వాహాకు పాల్పడిన ఔట్‌సోర్సింగ్ డ్రైవర్ రమేశ్‌ను శాశ్వతంగా విధుల నుంచి తొలగించాలని ఆదేశించారు. 'బల్దియా వాహనాల్లో ఇంధన దోపిడీ' శీర్షికన ఈనెల 7న 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి కమిషనర్ స్పందించారు. ఈ మేరకు సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని బల్దియా వెహికిల్ షెడ్డును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వెహికల్ షెడ్డులో సిబ్బంది విధులను అడిగి తెలుసుకున్నారు. షెడ్డులో సమస్యలు, వాహనాల మరమ్మతులు, హాజరును పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ చెత్త తరలింపు వాహనాలను వెంటనే మరమ్మతు చేసి పంపించాలని అధికారులను ఆదేశించారు. వాహన షెడ్డులో సీసీ కెమెరాలు, వాహన లాగ్‌బుక్‌లకు శానిటరీ సూపర్‌వైజర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు విధిగా బాధ్యతలు చేపట్టాలన్నారు. వాహనం ఎన్ని కిలోమీటర్లు తిరిగిందని, వినియోగించిన డీజిల్ ఎంత అనే వివరాలు ప్రతిఒక్కరి వద్ద ఉండాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం చేస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని కమిషనర్ హెచ్చరించారు. తనిఖీల్లో సీఎంహెచ్‌ఓ రాజేష్, ఈఈ సంజయ్‌కుమార్, ఏఈ సంతోష్‌కుమార్, శానిటరీ సూపర్‌వైజర్ భాస్కర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అనిల్ పాల్గొన్నారు.

ఉగాది తర్వాతే ఎంపీ అభ్యర్థి ప్రకటన

మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



మాట్లాడుతున్న ఎర్రబెల్లి దయాకర్‌రావు

హసన్‌పర్తి : ఉగాది పండుగ తర్వాతే బీఆర్ఎస్ వరంగల్ ఎంపీ అభ్యర్థిని ప్రకటిస్తామని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. నగరంలో సోమవారం జరిగిన వర్ధన్నపేట నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలని సూచించారు. పార్టీకి మోసం చేసిన వారికి ప్రజలే గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. కడియం శ్రీహరి ద్రోహి అని, ఆయనకు ఎమ్మెల్యేతోపాటు మంత్రి పదవి కూడా తానే ఇప్పించినట్లు గుర్తుచేశారు. ఎంపీ ఎన్నికల్లో కడియం కావ్య మూడోస్థానంలో ఉంటుందని జోస్యం చెప్పారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ కడియం శ్రీహరిని పార్టీలో చేర్చుకునే సమయంలో తాను వ్యతిరేకించినట్లు చెప్పారు. మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ కేసీఆర్‌తో పెట్టుకుంటే పతనం తప్పదని హెచ్చరించారు. కాగా, నియోజకవర్గంలోని వర్ధన్నపేట, ఐనవోలుతోపాటు పర్వతగిరి మండలాలకు ఎర్రబెల్లి దయాకర్‌రావుకు బాధ్యతలు అప్పగించారు. నియోజకవర్గం పరిధిలోని 13 డివిజన్లతోపాటు హసన్‌పర్తి మండలంలోని 15 గ్రామాల బాధ్యతలను మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ తీసుకున్నారు. సమావేశంలో రైతు బంధు సమితి జిల్లా మాజీ కోఆర్డినేటర్ ఎల్లావుల లలితాయాదవ్, కార్పొరేటర్ దివ్యారాణి, మాజీ కార్పొరేటర్ గుగులోత్ రాజునాయక్, డివిజన్ అధ్యక్షులు నరెడ్ల శ్రీధర్, చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి, అటికం రవీందర్, నేరెళ్ల రాజు, మండల అధ్యక్షులు బండి రజినీకుమార్, కుమారస్వామి, పీఏసీఎస్‌వైస్ చైర్మన్లు పాడి మల్లారెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

ఎక్స్‌రే పరికరంలో సాంకేతిక లోపం

ఎంజీఎం : ఎంజీఎం ఆస్పత్రి పరిపాలనాధికారుల అనాలోచిత నిర్ణయాలతో రోగులకు తిప్పలు తప్పడం లేదు. లక్షలాది రూపాయల ఆరోగ్యశ్రీ నిధులను పక్కదారి పట్టిస్తూ, నూతన పరికరాల కొనుగోళ్లపై దృష్టి సారించడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. ప్రతిరోజు వేలాది మంది రోగులు వచ్చే ఎంజీఎం ఆస్పత్రిలో ఒకే డిజిటల్ ఎక్స్‌రే పరికరం ఉంది. సోమవారం ఈ పరికరంలో సాంకేతిక లోపం ఏర్పడడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొన్ని సంవత్సరాలు ఆస్పత్రిలో ఒకే డిజిటల్ ఎక్స్‌రే మిషన్‌తో సేవలందిస్తున్నారు. సాంకేతిక లోపంతో రోగులకు సేవలు అంతంత మాత్రమే అందాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి మెరుగైన సేవలందించాలని రోగులు కోరుతున్నారు.

ప్రేరణ శిక్షణకు ఎంపిక

కాళోజీ సెంటర్: ప్రేరణ ఉత్సవ్ కార్యక్రమానికి వరంగల్ జిల్లా నుంచి ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు జిల్లా అకడమిక్ అధికారి మాలోత్ సారయ్య తెలిపారు. సోమవారం జిల్లాలోని నవోదయ పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో 97 మంది విద్యార్థులు పాల్గొనగా అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన ఇద్దరు విద్యార్థులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశామన్నారు. వీరు గుజరాత్‌లో జరిగే ప్రేరణ శిక్షణలో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో నవోదయ పాఠశాల ఇన్‌చార్జ్ శ్రీమనుమోహన్, రమేష్, హీరాలాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఓటరును కలిసి ప్రచారం చేద్దాం

బీజేపీ వరంగల్ ఎంపీ అభ్యర్థి ఆరూరి రమేశ్



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ వరంగల్ ఎంపీ అభ్యర్థి అరూరి రమేశ్

హన్మకొండ : పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతీ ఓటరును కలిసి ప్రచారం చేద్దామని బీజేపీ వరంగల్ ఎంపీ అభ్యర్థి అరూరి రమేశ్ పిలుపునిచ్చారు. హనుమకొండలోని ఓ హోటల్‌లో సోమవారం జరిగిన బీజేపీ పార్లమెంట్ నియోజకవర్గస్థాయి కోర్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధిని ప్రజల్లో విస్తృత ప్రచారం చేయాలన్నారు. ప్రస్తుతం బీజేపీకి అనుకూలంగా ఉన్న పరిస్థితులను ఓటు రూపంలోకి మలుచుకునేందుకు కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. ఎన్డీఏ గెలిచే 400 లోక్‌సభ స్థానాల్లో వరంగల్ ఉండేలా దూసుకుపోదామని పిలుపునిచ్చారు. తన నుంచి అందరికి సంపూర్ణ సహకారం ఉంటుందని, సమన్వయంతో పనిచేద్దామన్నారు. వరంగల్ ప్రజలు ఈసారి బీజేపీని గెలిపించాలని కోరారు. బీజేపీ వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ తాళ్లపల్లి కుమారస్వామిగౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ వి.మురళీధర్‌గౌడ్, క్లస్టర్ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, రాష్ట్ర అధికార ప్రతినిధి చందుపట్ల కీర్తిరెడ్డి, హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు ఏడునుతుల నిషిధర్‌రెడ్డి, జనగామ జిల్లా అధ్యక్షుడు అరుట్ల దశమంతరెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ విజయరామారావు, నగర మాజీ మేయర్ టి.రాజేశ్వర్‌రావు, నాయకులు చాడ శ్రీనివాస్‌రెడ్డి, ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, డాక్టర్ కాళీప్రసాదరావు, లేగా రామ్మోహన్‌రెడ్డి, లింగంపల్లి ప్రసాద్‌రావు, యుగేంధర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేటినుంచి వసంత నవరాత్రోత్సవాలు



భద్రకాళి ఆలయంలో కొత్తకుండలు అందజేస్తున్న కుమ్మరి సంఘం నాయికులు

హన్మకొండ కల్చరల్ : భద్రకాళి దేవాలయంలో మంగళవారం నుంచి ఈనెల 17 వరకు వసంత నవరాత్రోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నారు. అమ్మవారికి పూర్ణాభిషేకం నిర్వహించిన అనంతరం ఉత్సవాలు ప్రారంభిస్తారు. ఇందులో భాగంగా ప్రతిరోజు లక్షపుష్పార్చన నిర్వహించనున్నారు. అలాగే, ఉగాదిని పురస్కరించుకుని ఆలయంలో పచ్చడి తయారీ కోసం కుమ్మరి సంఘం నాయకులు సోమవారం కొత్తకుండలు అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ కుమ్మరి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆవునూరి రామ్మూర్తి, వరంగల్ జిల్లా అధ్యక్షుడు రుద్రారపు కుమారస్వామి, కుల సంఘం నాయకులు నాగరాజు, శ్రీకాంత్, పీఏసీఎస్ డైరెక్టర్ రాజ్‌కోటి పాల్గొన్నారు.

కేంద్రంలో కాంగ్రెస్‌దే అధికారం

భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, ఎంపీ అభ్యర్థి కడియం కావ్య

శాయంపేట : కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయని, వరంగల్ ఎంపీగా కడియం కావ్యను లక్ష మెజార్టీతో గెలిపించాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు కోరారు. మండల కేంద్రంలోని ఎస్వీకేకే ఫంక్షన్‌హాల్‌లో సోమవారం నిర్వహించిన కాంగ్రెస్ వరంగల్ పార్లమెంట్ సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. భూపాలపల్లి, వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యేలు గండ్ర వెంకటరమణారెడ్డి, అరూరి రమేశ్ మాందారిపేట గుట్టల్లో మైనింగ్, ఇసుక దోపిడీ చేసి రూ.వందల కోట్లు సంపాదించుకున్నారని ఆరోపించారు. ఆస్తులను కాపాడుకోవడానికే అరూరి రమేశ్ బీజేపీలోకి వెళ్లారని పేర్కొన్నారు. కాంగ్రెస్ వరంగల్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్య మాట్లాడుతూ ఆస్తులు కాపాడుకోవడానికి తాము పార్టీ మారలేదని స్పష్టం చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన అరూరి రమేశ్ తమపై ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. అనంతరం పలు గ్రామాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు 200 మంది కాంగ్రెస్‌లో చేరారు. సమావేశంలో వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ కత్తి వెంకటస్వామి, రాష్ట్ర నాయకులు కటంగూరి రాంనర్సింహా రెడ్డి, అధికార ప్రతినిధి గాజర్ల అశోక్, ఎంటీసీసీ బాసాని చంద్రప్రకాశ్, పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి, నాయకులు బసాని శాంతరవి, అబ్బు ప్రకాశ్‌రెడ్డి, మారెపల్లి రవీందర్, దుబాసి కృష్ణమూర్తి, కొమ్ముల భాస్కర్, కుమారస్వామి పాల్గొన్నారు.

335 క్వింటాళ్ల రేషన్ బియ్యం సీజ్

హసన్‌పర్తి : అక్రమంగా తరలిస్తున్న 335 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. వరంగల్‌కు చెందిన జన్ను అనిల్ రేషన్ బియ్యం దందాకు తెరలేపాడు. నగరంతో పాటు చుట్టు పక్కల ప్రాంతాలకు చెందిన తెల్లరేషన్‌కార్డుదారుల నుంచి బియ్యాన్ని సేకరిస్తున్నాడు. కిలో బియ్యం రూ.8 నుంచి రూ.10కి సేకరించి రూ.18 నుంచి రూ.20కి అమ్ముతున్నాడు. లారీలో రేషన్ బియ్యం మహారాష్ట్రకు వెళ్తున్నాయనే పక్కా సమాచారం ఆదివారం ఎన్‌ఫోర్స్‌మెంట్, పౌరసరఫరాల శాఖ అధికారులకు అందింది. అధికారులు అప్రమత్తమై హసన్‌పర్తి శివారులోని సీతంపేట క్రాస్‌వద్ద లారీని తనిఖీ చేశారు. లారీలో రూ.13,06,500 విలువైన 335 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్ కృష్ణ ఫిర్యాదు మేరకు జన్ను అనిల్, లారీ డ్రైవర్ సునీల్‌పై క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై అశోక్ తెలిపారు.



మాట్లాడుతున్న టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం

ఉన్నత విద్యను బలోపేతం చేయాలి

కుర్తా సింపోజియంలో వక్తలు

రిటైర్డ్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం కాకతీయ యూనివర్సిటీలోని సెనెట్ హాల్‌లో 'రాష్ట్రంలో ఉన్నత విద్య పరిస్థితులు –బలోపేతం' అనే అంశంపై రాష్ట్రస్థాయి సింపోజియం నిర్వహించారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి మాజీ చైర్మన్ ప్రొఫెసర్ టి.పాపిరెడ్డి, కేయూ వీసీ తాటికొండ రమేష్, టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం, సెంట్రల్ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ జి.హరగోపాల్ తదితర వక్తలు పాల్గొని తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

- వివరాలు 8లో▸ - కేయూ క్యాంపస్



ఘనంగా విశ్వబ్రాహ్మణుల ఉగాది

విశ్వబ్రాహ్మణులు ఉగాది పండుగ వేడుకకు ముందు అమావాస్య రోజు తీగదారు పూలతో పందిరి ఏర్పాటు చేసి వారి కులదైవం వీరబ్రహ్మేంద్రస్వామిని ప్రతిష్ఠించుకుని పూజలు చేయడం ఆనవాయితీ. ఈ సందర్భంగా నగరంలోని పలువురు విశ్వబ్రాహ్మణులు ఉగాది పండుగను సోమవారం ఘనంగా నిర్వహించుకున్నారు. వారి వృత్తి సామగ్రిని మోదుగ పూలుతో అలంకరించి, భక్ష్యాలు, ఉగాది పచ్చడి నివేదన చేశారు.


పూజలు చేస్తున్న విశ్వబ్రాహ్మణులు

నేడు టీటీడీ ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం

ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో నేడు(మంగళవారం) పంచాంగ శ్రవణం ఏర్పాటు చేశామని కార్యక్రమ నిర్వాహకులు రామిరెడ్డి కృష్ణమూర్తి సోమవారం ప్రకటనలో తెలిపారు. అలాగే శ్రీరామ నవమిని పురస్కరించుకుని శ్రీమద్రామాయణ సప్తహ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ మేరకు హనుమకొండలోని ఏకశిల పార్కులో గల సీతారామచంద్ర ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం, వరంగల్‌లోని హంటర్‌రోడ్డులోని అభయాంజనేయస్వామి వారి ఆలయంలో మంగళవారం సాయంత్రం పంచాంగ శ్రవణానికి తగిన ఏర్పాట్లు చేశామని ఆయన వెల్లడించారు.

కుజగ్రహం రాజుగా..




ఈ సంవత్సరం కుజగ్రహం రాజుగా ఉండడం జరుగుతోంది. క్రోధి అనే పేరుతో వస్తున్న ఈ కాలం క్రోధ స్వభావం కలిగిన కుజ గ్రహానికి రాజాధిపత్యం వచ్చింది. ఉగాది పండుగ తేదీ 9, వారం మంగళవారం కావడం వల్ల కుజగ్రహం సంపూర్ణంగా బలవంతుడై ఉంటాడు. ఈ సంవత్సరం కఠిన నిర్ణయాలు తీసుకోవడం, న్యాయపర విషయాల్లో గట్టి వైఖరి కలిగి ఉండడం సహజంగా ఏర్పడుతుంది. రాజు కుజుడు కావడంతో ప్రజలు, పాలకుల్లో క్రోధ, ఆవేశాలు పెరగడం, భూ సంబంధ వ్యవహారాలు ఉత్పన్నమవుతాయి. రాజకీయాల్లో ఊహించని పరస్పర వ్యతిరేకాలు తారాస్థాయికి చేరుతాయి.

– శివపురం రామలింగ ఆరాధ్య, విశ్రాంత అర్చకులు, కరీమాబాద్, వరంగల్

శ్రీక్రోధి నామ సంవత్సరానికి స్వాగతం


బంతిపూలు కొనుగోలు చేస్తున్న ప్రజలు



హన్మకొండ కల్చరల్ : తెలుగువారి పండుగల్లో యు(ఉ)గాది పండుగ మొట్టమొదటి. పంచాంగం ప్రకారం ప్రతీ ఉగాదికి ఒక్కో పేరు ఉంటుంది.38వది క్రోధి నామ సంవత్సరం. ఇది కోపం కలిగించేది అని చెప్తారు. 'యుగాది'లో యుగం అనగా వయస్సు, ఆది అనగా ప్రారంభమని అర్థం . ఉగాది పండుగ తెలుగు సంస్కృతీ, సంప్రదాయాలకు కేంద్ర బిందువుగా ఆనందానికి, సౌభాగ్యానికి, ఆధ్యాత్మిక చింతనకు, పల్లెలలోని జానపదుల జీవనశైలికి సంకేతంగా నిలుస్తోంది. ఉగాది కాలానికి సంబంధించిన పండుగ. వేప చెట్లు అమృతాన్ని నింపుకున్న పూలతో ప్రకాశిస్తుండగా మామిడి చెట్లు లేలేత పిందెలతో మానవ కల్యాణానికి మంగళగీతాలు పాడుతుండగా మోదుగ చెట్లు నిప్పు కణికలాంటి పూలతో శోభాయమానం చేస్తుండే వసంతకాలంలో రమణీయమైన సొగసులతో అలరారే చైత్రమాసం ప్రారంభమవుతుంది. చైత్ర శుక్ల పాడ్యమి రోజున ప్రతియేటా ఈ పండుగను జరుపుకుంటారు. మంగళవారం ఉగాదిని పురస్కరించుకుని నగరంలోని పలు కూడళ్లలో కొత్తకుండలు, మోదుగు పూలు, కొత్తచింతపండు, మామిడాకులు, కాయలు, వేప పూలు, చామంతి, గులాబీ, బంతి పూలు, గులాలు, పసుపు, కుంకుమ, గుగ్గిలం తదితర పూజా సామగ్రి అమ్మకాలు సాగాయి.

ఉగాది పచ్చడి ప్రత్యేకత..

ఆయా కాలాల్లో పండించిన వాటిని పండుగల సందర్భంగా దేవుడికి నివేదించిన అనంతరం స్వీకరిస్తాం. చైత్రమాసంలో లభించే చింతపండు, బెల్లం , మామిడి పిందెలు, వేపపూతను కొత్తకుండలో వేసి పచ్చడిగా చేసి భగవత్ నివేదనలుగా సమర్పిస్తారు. తెలంగాణలో ఉగాది పచ్చడిని పానీయంలాగే చేయడం సాంప్రదాయం. దీన్ని షడ్రుచుల సమ్మేళనంగా భావిస్తారు. నిజానికి ఉగాది ప్రారంభంలో మిరపకాయలు లేవు పూర్వం మిర్యాలు వాడేవారు. ఉగాది పచ్చడిలో కొందరు మిర్యాల పొడి వేయడానికి, ఉల్లిగడ్డ ముక్కలు వేయడానికి అదే కారణం. ఉప్పు కూడా కొద్దిగా వేస్తారు. ఉగాది పండుగరోజు దేవుడికి సమర్పించే నివేదనలలో కొత్తబెల్లం, కొత్త శనిగ పప్పు ఉడికించి చేసే భక్ష్యాలను నైవేద్యంగా సమర్పిస్తారు. ఉగాది పచ్చడి ఎన్నో ఔషధ గుణాలతో కలిగి ఉంటుంది. ముఖ్యంగా కచ్చమామిడి కాయ, చింతపండు, బెల్లం శరీరంలోని రుగ్మతలను తట్టుకునే శక్తి ఉందని శాస్త్రీయంగా నిరూపితమైంది. వేప పువ్వును పచ్చడిలో వాడటం ప్రత్యేకత. బెల్లంను నేరుగా తింటే శరీరానికి వేడి చేస్తుంది. పానీయంగా వాడితే ఎండనుంచి రక్షించుకోవచ్చు.

38వ తెలుగు సంవత్సరం.. 60 తెలుగు సంవత్సరాలలో 38వది క్రోధినామ సంవత్సరం. ఇది కోపానికి సూచిక.. నేడు కొంగొత్త శ్రీక్రోధి నామ సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ఉగాది పర్వదినం నిర్వహిస్తారు.

ఉన్నతవిద్యను బలోపేతం చేయాలి



సింపోజియంలో మాట్లాడుతున్న సెంట్రల్ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ హరగోపాల్, పాల్గొన్న అధ్యాపకులు

- హయ్యర్ ఎడ్యుకేషన్ నిర్లక్ష్యానికి గురైంది
- వర్సిటీల్లో అధ్యాపకుల కొరత.. నిధులు కేటాయింపు తక్కువ
- ఉన్నతవిద్యలో ప్రతికూల ప్రభావం
- కేయూలో కుర్తా సింపోజియంలో వక్తలు

కేయూ క్యాంపస్ : యూనివర్సిటీల్లో ఉన్నత విద్యను బలోపేతం చేసేందుకు, బడ్జెట్‌లో నిధులు అధికంగా కేటాయించాలి. రాష్ట్రంలో గత దశాబ్ద కాలం పాటుగా వర్సిటీల్లోని ఉన్నత విద్య నిర్లక్ష్యానికి గురైందని అధ్యాపకుల కొరతతో విద్యార్థులకు నాణ్యమైన విద్య, పరిశోధనలపైన ప్రతికూల ప్రభావం చూపిందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. వర్సిటీల్లోనూ, డిగ్రీ కళాశాలల్లోనూ విద్యార్థుల సంఖ్య పెరుగుతోందని ప్రధానంగా విద్యార్థినుల (అమ్మాయిలు) సంఖ్య బాగా పెరిగిందని అందుకనుగుణంగా వారికి కూడా సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యారంగంపై పాలకవర్గాలు విద్యా విధానాలు రూపొందించడంలోనూ అంతగా పట్టించుకోవటం లేదన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలోను బడ్జెట్‌లో విద్యారంగానికి నిధులు తక్కువగానే కేటాయిస్తున్నారన్నారు. విద్యారంగాభివృద్ధికి గత ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదనేది స్పష్టం అవుతోందని వారు అభిప్రాయపడ్డారు. కేయూ రిటైర్డ్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పరిపాలన భవనంలో నిర్వహించిన సెనేట్ హాల్‌లో రాష్ట్రంలో ఉన్నత విద్య పరిస్థితులు, బలోపేతం అంశంపై రాష్ట్రస్థాయిలో నిర్వహించిన సింపోజియంనకు కుర్తా అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎ.సదానందం అధ్యక్షత వహించారు. జనరల్ సెక్రటరీ ఆచార్య వడ్డె రవీందర్, తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి మాజీ చైర్మన్ ప్రొఫెసర్ టి పాపిరెడ్డి, రిటైర్డ్ ఆచార్యులు కూరపాటి వెంకటనారాయణ మాట్లాడారు. ఈ సింపోజియంలో వచ్చిన అభిప్రాయాలపరంగా సూచనలు, సలహాలతో డాక్యుమెంట్ల రూపేణ ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని కుర్తా అధ్యక్షుడు సదానందం తెలిపారు.

చదివించినప్పుడే ప్రశ్నించే అవకాశం

వ్యక్తిగా తాను సొంతంగా ప్రైవేటు విద్యాసంస్థల్లో డబ్బులు పెట్టి చదువుకుంటారు. వారు ఉన్నత విద్యను పూర్తి చేశాక తాము డబ్బులు సంపాదించేందుకే మొగ్గు చూపుతున్నారనేది స్పష్టమవుతోంది. ప్రభుత్వపరంగా విద్యను అందిస్తే సమాజం తనను చదివించింది అనే భావనతో విద్యను పూర్తిచేసిన వ్యక్తుల్లో సేవాభావం ఉంటుంది. అంతేగాకుండా సమాజం కూడా నైతికంగా ప్రశ్నించే అవకాశం ఉంటుంది. ప్రభుత్వ విద్య పటిష్టానికి సమాజంలోకి వెళ్లి సామాజికంగా చైతన్యం కల్పించాల్సిన అవసరం ఉంది.

– హరగోపాల్, సెంట్రల్ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్

సింపోజియంతో కనువిప్పు కలగాలి



సమాజంలో విద్యావ్యవస్థ కీలకమైంది. విద్య ద్వారానే సమాజ అభివృద్ధి సాధ్యం. ఆల్‌ఇండియా ఎడ్యుకేషన్ సర్వే రిపోర్టు చూస్తే భారత దేశంలో విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ 28.4 శాతం ఉంటే తెలంగాణలో 40 శాతం వరకు ఉంది. ఇలాంటి సింపోజియం డిబేట్‌ల ద్వారా విద్యారంగ అభివృద్ధికి పలు సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లాలి.

– ఆర్.లింబాద్రి, రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్

సరైన విద్యా విధానం లేదు



దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు గడిచినా నేటికి సరైన విద్యా విధానం లేదు. వివిధ ప్రభుత్వాల హయాంలో ఇప్పటి వరకు కోఠారి కమిషన్‌తో పాటు వివిధ కమిషన్లు వేశారు. నూతన జాతీయ విద్యావిధానం–2020 అని అంటున్నారు. కానీ నేటికి సరైన నిర్దిష్టమైన విద్యావిధానాన్ని రూపకల్పన చేయలేకపోయారు. కేంద్రం బడ్జెట్‌లో విద్యారంగానికి నిధులు తక్కువగానే కేటాయిస్తోంది.

– తాటికొండ రమేష్ కేయూ, వీసీ

గతంలో వర్సిటీలకు నిధులు ఇచ్చాం

తాను యూజీసీ చైర్మన్‌గా ఉన్నప్పుడు దేశంలో యూనివర్సిటీలకు రీసెర్చ్‌పర్పస్‌లో వివిధ ఫెలోషిప్స్ ఇచ్చాం. పరిశోధన పరంగా నిధులిచ్చి ప్రోత్సహించాం. తొలుత ఆయన జూమ్ మీటింగ్‌లో న్యూఢిల్లీ నుంచి కొద్ది సేపు మాట్లాడారు. గత పదేళ్లగా యూజీసీకి నిధులు తగ్గిపోయాయన్నారు. ప్రభుత్వ ఉన్నత విద్యారంగంలో నాణ్యమైన విద్య తదితర అంశాల గురించి ఆయన వివరించారు.

– సుఖ్‌దేవ్‌తోరెట్, యూజీసీ మాజీ చైర్మన్

నాణ్యమైన విద్య అందించాలి



ఇంజనీరింగ్ విద్యలోనూ నాణ్యమైన విద్యను అందించాల్సి ఉంటుంది. ఇంజనీరింగ్ పూర్తిచేసుకున్న విద్యార్థుల్లో ప్రతి ఏడాది బయటికి వస్తున్న వారిలో 30 శాతంమందికి ఉద్యోగానికి సంబంధించిన స్కిల్స్ ఉద్యోగ అర్హతలు ఉండటం లేదు. తాను హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్‌అండ్ సైన్స్‌కాలేజీలో డిగ్రీ పూర్తిచేశాను. తాను సోమవారం ఆ కళాశాలను సందర్శించి చూశాను. రెగ్యులర్ ఫ్యాకల్టీ కొందరే ఉన్నారు. దీంతో విద్యార్థులపై ప్రతికూల ప్రభావం పడుతుంది.

– డాక్టర్ మోహన్‌రావు, సీసీఎంబీ మాజీ డైరెక్టర్

మార్పునకు విద్య ఒక సాధనం



సామాజిక మార్పునకు విద్య ఒక సాధనం. విద్యార్థులు చదువుకోవాలని ఉన్నప్పటికీ వాటికి అనుగుణంగా సదుపాయాలు లేవు. ప్రభుత్వం టీచింగ్ ఫ్యాకల్టీని నియమించాలి. సంపూర్ణంగా అంతర్గతంగా పనిచేసే వాతావరణం కల్పించాల్సి ఉంటుంది. ఉన్నత విద్య రంగాభివృద్ధికి తగినంత నిధులు వర్సిటీలకు కేటాయించాల్సి ఉంటుంది.

– కోదండరామ్, తెలంగాణ జనసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు

సైన్స్‌తోనే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం

- సీసీఎంబీ మాజీ డైరెక్టర్ డాక్టర్ మోహన్‌రావు

కేయూ క్యాంపస్ : నేటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సైన్స్‌తోనే సాధ్యమైందని సైన్స్‌పై విద్యార్థులు ఎక్కువగా ఆసక్తిని పెంపొందించుకోవాలని సీసీఎంబీ మాజీ డైరెక్టర్ డాక్టర్ మోహన్‌రావు అన్నారు. సోమవారం హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్‌అండ్ సైన్స్ కళాశాలలో సైన్స్ విభాగం అధ్యాపకులకు నిర్వహించిన ఓరియంటేషన్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సమాజంలో ఏదైనా సంఘటన జరిగినప్పుడు నిజనిర్ధారణ కోసం సైన్స్‌ను ఆశ్రయిస్తారన్నారు. ముఖ్యంగా డీఎన్ఏ పరిశోధనతో వాస్తవాలు బయటకు వస్తాయన్నారు. రాజకీయ నాయకులు తమ పదవీకాలం ముగియగానే సమాజంలో తెగతెంపులు అవుతాయన్నారు. కానీ శాస్త్రవేత్తకు నిరంతరం పరిశోధనల అనుసంధానం ఉంటుందన్నారు. కేయూ వీసీ ఆచార్య తాటికొండ రమేష్ మాట్లాడుతూ.. అధ్యాపకులు తమకున్న అవకాశాలను అందిపుచ్చుకొనే విధంగా తరగతి గది పరిశోధనకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. బోధన, పరిశోధన నిరంతర ప్రక్రియ అన్నారు. కొంతమందికి అవకాశాలు రావడంతో వారి సేవలు సమాజానికి వివిధ రకాలుగా ఉపయోగపడుతాయన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.జ్యోతి మాట్లాడుతూ.. మానవాభివృద్ధిలో సైన్స్ పాత్ర కీలకమన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రమేష్, అధ్యాపకుడు డాక్టర్ ఆదిరెడ్డి, సైన్స్ విభాగం అధ్యాపకులు పాల్గొన్నారు. కాగా డాక్టర్ మోహన్‌రావు ఈ కళాశాల పూర్వ విద్యార్థి కావడంతో ఆయన కళాశాలను సందర్శించి పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

TO-LET

- 3 BHK, Near: L.B.Nagar Muncipal Park, 1st Floor, Lift Facility available. L.B.Nagar, Warangal. Cell: 9866042155. [W-1264926]

PLOT FOR SALE

- మామునూర్‌లో కుడా లేఅవుట్ రెండు దిశలా చౌరస్తా నుండి మరియు జ్యోతిబాపులే ఆశ్రమ పాఠశాల పక్క నుండి 800 మీటర్ల దూరంలో పెన్షన్‌పురా డాంబర్ రోడ్డుపై సౌత్ ఫేసింగ్ 263, 228 అమ్మకానికై 9032111600. [W-1264875]

WANTED

- Govt (Regd) సంస్థ తరపున Work చేయుటకు సొంత కంప్యూటర్ గలవారు కావలెను. ఇంటి దగ్గరే వర్క్ చేస్తూ 9 to 19K వరకు సంపాదించే అవకాశం. సెల్: 8977429273. [W-1264916]
- ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్స్ కలవు. మీ పేరు, అడ్రస్ కాల్ / వాట్సప్ చేయగలరు. 90596 63584, 95026 15217. [M-1185024]
- Hydలోని పేషెంట్లను, ముసలివారిని, వారి ఇంటి వద్దనే చూసుకొనుటకు ఆయాలు, వార్డ్ బాయ్స్, నర్సులు, కేర్‌టేకర్స్ కా॥. జీ : 10-25 వేలు. రూం + భో॥ ఫ్రీ. Ph: 9000638842, 9866605144 [HA-13644]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ	9010144453
వరంగల్	9705748198
నర్సంపేట	9553955722
జనగామ	9951602871
మహబూబాబాద్	9010144453
పరకాల	9010299096
జయశంకర్ భూపాలపల్లి	9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.